# నాగరాజు

అనగా అనగా ఆంధ్రదేశంలో పినాకినీతీరాన్న సింహపురి పెరుమాళ్ళదేవాలయమండపంలో ప్రతి సాయంత్రం చిఱుమబ్బులన్నీ కరిగిపోయే దివ్యవీణాగానం వినిపించేది. దేశదేశాల్నుంచి ఆ అమృతస్వరాలు వినేటందుకు వృద్ధులు, యువకులు, నవతుషారపరిమళగాత్రులు, అంతా వచ్చి పులకరాలతో తన్మయత్వంపొందేవాళ్లు. మండపంలోనూ మెట్ల మీదను రంగురంగుల వస్త్రాలతో వెన్నెట్లో విరగబడే సముద్రపు కెరటాల్లా చిత్రమైపోయేవారు కొన్ని నయనాలు నిమీలితములై పాడ్యమినాటిచంద్రవంకలా చెమరించేవి. విస్ఫారితనయనాలు కొన్ని చైతన్యం వదలి బంగారుకిరణాల్ల నీటిలో మఱచి విహరించే చేప-రీతిగా తళుకులాడేవి.

ఆ మండపంమీద సౌందర్యంముద్దపోసిన ఓ యౌవనుడు దంతం, మంచిగంధంతీగెలుసాగినవీణ మేళవించి, గౌరీశంకరశృంగంపై మంచుమరిగే విమలగాంధర్వం జగన్మోహనం చేసేవాడు. బంగారంబరిసేబళ్లు, తెలుగుపల్లవుల వేంగీపురం— ఏనుగుల కుంభస్థలాల్లాంటిభుజాలు, పర్వతసానువువంటి వెడద రొమ్ము, నల్లటి ఉంగరాలజుట్టు, చిలకముక్కు, విశాలమైన ఫాలం. ఆ పడుచుపాటగాడు, వీణ—వయ్యారంగా పల్లెవాటు వేసుకొని, చిక్కుడుకాయల్లాంటి వేళ్ళతో తీగెలుసవరించి, మెట్లునొక్కుతూ వీణపాడుతుంటే, పేరుపొందిన గాయకులు, వైణికులు వినటానికివచ్చి, దినందినం ఆ పట్టణంలోనే నిల్చిపోయేవారు.

సహజసంగీతరసోద్రేకంకల యువజనులు అతనిపాటలు విని, ఆయన్ని గురువుగా ఎంచుకొని, ఆమోస్తరుగా వీణెలు సంపాదించి, ఇళ్ళదగ్గిర సంగీతం నేర్చుకుంటూఉండేవారు.

అక్కడికి ఒక పరాయిదేశంమనిషి వచ్చి భయంకరంగా అకర్షించే కెంపుకళ్ళతో, ఊగిపోతూ పాట వినేవాడు. ఆతని ఆకుపచ్చని తళుకుపంచెకూడా ఆ సంగీతం వినేటట్లే కనపడేది.

## 2

ఒక సంధ్యాకాలంలో—ఆ వీణాధరుడు హాయిమను కొత్తపాట ఒకటి మోహనమైన గాత్రంకలిపి తీగెలపై మోగించినాడు. సభ్యులందరూ పరవశులైపోయినారు.

చిరునవ్వుతో ఆ పాటకాడు అందరినీ చూచి, పరాయిదేశంమనిషిపై చూపునిలిపి, 'ఓ నాగరాజా! నే పాడే ఈ నూత్న ఫణితులలో అపశ్రుతి ఏమాత్రం కలిగినా, ఈ నా కుడిచెయ్యిపై కాటేసి, నన్ను దహింపవలసింది' అని అడిగాడు. గుండెలుపగిలే పామునవ్వుతో ఆ పరాయిదేశం మనిషి ఔనన్నట్లు తలతిప్పాడు. ఒక్కనిమేషం నిర్మల నీలాకాశంవైపు చూపులు పోనిచ్చి కన్నులరమూతలువడగా, స్ఫటికంలాంటి చక్కని వీణాదండాని తాకించి, ఒక్క విచిత్రరాగం ఆలాపం వేశాడా బాలమూర్తి. కొండపొలాల్లో పరుగులెత్తే వాగుల పాములు నిశ్శబ్దంలోంచి బయలుదేరినై. ఉదయం మంచుగుళికలు చెట్ల లేతచిగురుటాకులనుండి క్రింద సెలయేటి నీటిలో జారిపడి మారుమ్రోగాయి. వృక్షముల గానమైనది. సాం

ధ్యరాగాలలో జీరలు పోయి, తీగెలుసాగి, పలనలై తలపుల కలుములై నది. గంభీరసముద్రవీచికల హోరైంది. కథల పాడింది. బుక్కులై ఘనరాగమైపోయింది. సర్వమహామండలాలు ఊగించి, ఒక్కచూరాగి, తళుక్కున తారాలోకమై మాయమైంది ఆ పాట.

# 3

ఈ గానాలనుడిలో తన్మయుడై పోయి, ఆ పరాయిదేశం మనిషి కన్నులే చెవిగా విన్నాడు. ఇటు నటు తాండవించి పోయాడు.

ఆ సమయంలో, అతనిశిరస్సువెనక మూడు సర్ప శిరస్సులు బయలుదేరాయి. ఆ తలల్లో మణికిరీటాలు పొడ సూపినై.

ఆ సమూహంలోంచి ఆజానుబాహుడైన ఒకవృద్ధతపసి లేచాడు. అతనిజడలు పాలసముద్రంపప్రవాహాలైనై. అతని పొడుగాటిగడ్డం వెన్నెల్లో ప్రయాణంచేసే తెల్లనిమబ్బయింది. మహాసత్వం తెలిపే తీక్షణదృష్టితో ఆ పడుచుపాటకుని చూచి 'అబ్బాయీ! కొన్నిముహూర్తాలకిత్రితము నీపాటలో అపశ్రుతి దోషముందా? మహదానందానికి లోపముందా? అసకళాప శ్రుతిదోషశిక్షారూపమూర్తియైన ఈ పాములరాజు నడిగావు' అని పరాయిదేశం మనిషినిచూచి, "ఓ నగరాజా! ఈ గాన గర్వసంగీతములో అతులిత దివ్యానందం ఏప్రపంచానుంచి వస్తుంది? పూర్వసంప్రదాయాలన్నీ త్యజించి, హేయమైన

నూత్నశక్తులు సృజించాను. గాంధర్వస్త్రీప్రీతి దోషుడయిన ఇతనికి మరణమే శిక్ష” అని ఊరుకొన్నాడు.

ఆ మాటలకంతా హాహాకారం చేశారు. ఆపరాయిదేశం మనిషి వణికిపోయాడు. దీనంగా అతనికేసి చూశాడు. తల వాల్చి ఒక నిమేషం ఆలోచించాడు. బుస్సుమని నిట్టూర్పు పుచ్చాడు. ఇంతలో ఆ పరాయిదేశంమనిషి క్రోధమూర్తి అయ్యాడు. చూస్తుండగా, అతడు కరిగిపోయాడు. దేహమంతా, తళుకుతళుకుల పొడలున్న సర్పదేహమయింది. మనిషితల మాయమయింది.

ఎఱ్ఱజీరల నాలుకల ఆడిస్తూ సహస్రఫణాలు ఛత్రాలయ్యేట్లు ఆడిపోయినవి.

## 4

తేజస్సునిండిన మోములో చిరునవ్వులు తాండవించగా, ఆ బాలకుడు కాటుకై సూర్యకిరణంలాంటితనచేయి ముందుకు చాపాడు. ఆరుధనువుల పొడవై దేహం ఆడి చుట్టలుచుట్టు కొంటూండగా బుస్సుమని, ఆ నాగరాజు పడగలు వెనకకు పోనిచ్చి, మెరుపులా కాటువేయబోయేచిటికలో లోకాలు కదిపే తీగ పాటలస్వనంలో “ఆగు” అని మాటలు వినపడ్డాయి. ఆ మండపంమీద ఒక స్తంభాన్ని ఆనుకొని దినదినమూ పాట వినడానికివచ్చే ఒక బాలిక దివ్యసౌందర్యగాత్రి పద్మంలాంటి చెయ్యిచాపి, నాగరాజును ఆగుమని సన్నచేసింది. శృతులన్నీ మూసిపోయే చూపులతో ఆ తపసినిచూచి, ‘ఓ పూర్వసంప్రి

దాయీ, ఈ కుమారుని నూతన సంప్రదాయమును నీ పూర్వ సంప్రదాయమున కవ్రశుతి తీసికొని రాలేదు. ఈతని కొత్త పోకడలు అద్భుతానందం ఇస్తున్నవి. నీపూర్వసంప్రదాయ మంతా అనేక యుగాలలో, అనేక కళామూర్తుల కొత్త ఫక్కీలతో నిండివున్నవే. వెనుకటిమార్గముల కేమాత్రము అపశ్రుతిరాని కొత్తదారులు ఉత్కృష్టమైనవి. అనేక సంప్రదాయకర్తలవలె ఈ నూతన సంప్రదాయానికితడు మూల పురుషుడు. కళాధిదేవికి ఆనందాత్మయైన నా కితడీ నూతన కుసుమం అర్పించాడు. అది ప్రేమతో అంగీకరిస్తున్నాను' అని ఆమె వీణాపల్లవపాణియై వెలుగుల అంతర్హిత అయిపోయింది.

"ఓ కళాకుమారా! నువ్వు ధన్యమూర్తివి. నీ పాటలు లోకంలో వెదజల్లు నీదివ్యగీతికానాదం ప్రణయాలు కురియనీ జోలల్లో పాపలనూపనియ్. అనంతసత్వాల అవతరింపనియ్." అని తపసి ఎక్కడికోపోయాడు. ఆ పరాయిదేశం మనిషి, ఇంతలో మాయమైపోయాడు.